క్లుప్తంగా

సివిల్ డేపై అవగాహన



పిట్లం(జుక్కల్) : మండలంలోని చిల్లర్గిలో సివిల్ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై లింబాద్రి మాట్లాడుతూ దళితులపై వివక్ష చూపిస్తే చర్యలు తీసుకుంటామని, వారిపట్ల హోటళ్లలో, ప్రార్థనా మందిరాల్లో అవమానపరిస్తే కఠినచర్యలుంటాయన్నారు. ఆర్ఐ కులకర్ణి, నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి



రామారెడ్డి : రామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మరింత నాణ్యమైన సేవలను రోగులకు అందించి భవిష్యత్తులో మంచి పేరు తెచ్చుకోవాలని రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి ఆకాంక్షించారు. రామారెడ్డి ఆసుపత్రికి (ఎన్ క్యూఏఎస్) నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ మంగళవారం వైద్యాధికారి సురేష్‌ను సన్మానించారు. ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మాగౌడ్, మాజీ ఎంపీటీసీ యాదగిరి, లింగం తదితరులున్నారు.

శాలివాహన కుమ్మరి సంఘం కమిటీ ఎన్నిక



రాజు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల శాలివాహన కుమ్మరి సంఘం కమిటీ అధ్యక్షుడు కుమ్మరి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు సర్జన రమేశ్ ఆధ్వర్యంలో శాలివాహన కుమ్మరి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రవికిషోర్, సహాయ కార్యదర్శి సాయిరాం, కోశాధికారి చిన్న అంజయ్య ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే కృషితోనే గ్రామాల్లో అభివృద్ధి



మద్నూర్(జుక్కల్) : ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక కృషితోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని డోంగ్లీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బస్వరాజ్‌పటేల్ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మొగాలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. గ్రామంలో రూ. 5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పనులు మొదలవుతాయన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో సమీకృత భవనంలో మంగళవారం జరిగిన సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పాల్త్య విఠల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం పాలక వర్గం ఆధ్వర్యంలో జరగడంతో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జన్నుబాయి, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, ఎంపీటీసీలకు మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ పూలమాలతో వేసి శాలువా కప్పి, మెమెంటో అందించి ఘనంగా సన్మానించారు.తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో నీలావతి, ఎంఈవో నాగేశ్వరావు, నాయకులు హన్మాండ్లు, రాము తదితరులు పాల్గొన్నారు.

స్తంభం తొలగించేందుకు చార్జీ చెల్లించిన షబ్బీర్ అలీ



భిక్కనూరు : మండల కేంద్రం నుంచి గిద్ద దళితవాడకు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని అక్కడి నుంచి షిఫ్ట్ చేయడానికి అవసరమైన డీడీ కోసం రూ.13 వేలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విద్యుత్ అధికారులకు మంగళవారం అందజేశారు. రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం ఉందని పలువురు ట్రాన్స్‌కో అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించారు. స్తంభం తొలగించేందుకు స్తంభం తొలగించాల్సి ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు స్పష్టం చేశారు. భిక్కనూరుకు వచ్చిన షబ్బీర్‌అలీకి ఈ విషయం తెలపడంతో ట్రాన్స్‌కో ఏఈలు శ్రీనివాస్, రామలక్ష్మితో మాట్లాడి డీడీ తీసేందుకు రూ. 13వేలు అందజేశారు.ఎంపీపీ గాల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



బీబీపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు



సదాశివనగర్‌లో..



లింగంపేటలో..

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతిపత్రాల సమర్పణ



కామారెడ్డి పట్టణంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ బి జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్‌లను విడుదల చేయాలని, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1 : 100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్–2, 3 నోటిఫికేషన్‌లో పోస్టులను పెంచాలన్నారు. జీవో 46ను రద్దు చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు లింగం, నాయకులు నరేష్, భరత్, రాజేష్ తదితరులున్నారు.

బీబీపేట : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షులు పోసు శివకుమార్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ సత్యనారాయణకు బీజేవైఎం అధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షులు రంజిత్ గౌడ్, మండ ల ప్రధాన కార్యదర్శులు, శ్రీనివాస్, ప్రవీణ్ బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు మార్గం రజినీకాంత్, బీజేవైఎం నాయకులు రవి, శ్రీకాంత్, సురేష్, వంశీకృష్ణ తదితరులున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల బీజేవైఎం మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ గంగాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు కృష్ణారావు, ప్రేంకుమార్, సంజీవరెడ్డి తదితరులున్నారు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూమండల బీజేవైఎం నేతలు మంగళవారం స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు రాజు గౌడ్, ఉపాధ్యక్షుడు హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి రాజు తదితరులున్నారు.

దోమకొండ : నిరుద్యోగ సమస్యపై మంగళవారం దోమకొండ మండల కేంద్రంలోని బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సచిన్‌గౌడ్, కార్యదర్శి హరీష్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు రంజిత్‌యాదవ్, బీజేవైఎం నాయకులు భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

రాజంపేట : నీళ్లు, నిధులు నియామకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ మండల బీజేవైఎం అధ్యక్షుడు దేవిరెడ్డి సతీష్ ఆరోపించారు. మంగళవారం మండల బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవిరెడ్డి సతీష్ తదితరులున్నారు.



నాగిరెడ్డిపేటలో..



దోమకొండలో..



రాజంపేటలో..

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

- పట్టించుకోని అధికారులు
- ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి



చందాపూర్‌లో లీకవుతున్న మిషన్ భగీరథ నీరు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చందాపూర్‌లో మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన పైపులైన్‌లు లీక్‌కావడంతో గ్రామస్తులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిదులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ. కోట్లల్లో నిధులు వెచ్చించి ప్రతిగ్రామంలో ఇంటింటికి తాగునీరు అందించాలనే ప్రభుత్వం చూస్తుంటే అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండలంలోని చందాపూర్ గ్రామంలో మిషన్ భగీరథకు సంబంధించిన పెద్ద ట్యాంకులో నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే పైపులైన్ 8 నెలల నుంచి లీకేజి కావడంతో బురదమయంగా మారింది. బస్టాండ్ పక్కన పెద్దగుంతగా ఏర్పడి ఆ గుంతలో దోమలు, ఈగలు తయారయ్యాయి. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకు నుంచి గ్రామంలో సరఫరా అయ్యే పైపులైన్ కూడా గతనెలల నుంచి లీకవుతోంది. ఈనీరు కూడా వృథాగా పోయి మురికి కాలువగా తయారైంది. ఇకనైనా అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం



ఎల్లారెడ్డి : పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని స్నేహ హాస్పిటల్ సహకారంతో బజరంగ్‌దల్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యులు రమేశ్‌గౌడ్ ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని న్యూఆబాది కాలనీలో విద్యుత్ తీగలు కిందకు వేళాడుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్‌కు చెందిన చిల్డ్రన్ పార్క్‌కు సంబంధించిన సర్వీస్ వైరు కిందకు వేళాడుతుండడంతో అక్కడి నుంచి వెళ్లే వాహనాలకు తగిలి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



ఎరువుల కోసం క్యూలో ఉన్న రైతులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో గోదాం వద్ద మంగళవారం రైతులు బారులు తీరారు. గోదాంకు యూరియా ఎరువుల లారీలు వచ్చాయని తెలియగానే ఉదయం నుంచే రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గోదాంకు 900 సంచులు రావడంతో రైతులకు సరిపడా సరఫరా చేయలేక పోయారు. ప్రస్తుం మొక్కజొన్న, పత్తి, సోయ పంటలకు ఎరువులు వేసే సమయం వచ్చిందని రైతులు తెలిపారు. వెంటనే యూరియా తెప్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏవో శ్రీకాంత్‌ను వివరణ కోరగా యూరియా ఎరువులకు కొరత లేదని, సింగిలు విండోలు డీడీలు చెల్లించిన వెంటనే పంపిస్తామన్నారు. మండలంలోని కరడ్‌పల్లిలో 300 సంచులు, ఎండ్రియాల్‌లో 450 సంచుల యూరియా సంచులను పంపిణీ చేస్తామన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మద్నూర్(జుక్కల్) : రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోని పంట దిగుబడులు పెంచుకోవాలని కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు నీలరాణి, రవి శంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని శివారులో మంగళవారం పెసర, మినుము, సోయాబీన్, కంది, పత్తి పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సోయా పంటలో రసం పీల్చే పురుగు, పొగాకు లద్దే పురుగు, కాండం ఈగ ఆశించే అవకాశం ఉన్నట్లు గమనించామన్నారు. దీని నివారణకు రసం పిల్చే పురుగు తెల్లదోమ, పచ్చ దోమ ఉన్నట్లయితే ఏసీఫేట్ 300 గ్రాములు ఒక ఎకరాకి, లద్దె పురుగు ఉంటే ఏమనెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈవో ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు, రైతులు వినోద్, రాజేష్ తదితరులున్నారు.

పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి



లింగంపేటలో అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు



నిజాంసాగర్‌లో..



పిట్లంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): పది ఎకరాల వరకు పంటలు సాగు చేసే ప్రతీ రైతుకు రైతు భరోసా అందించాలని రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మంగళవారం మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, నల్లమడుగు, లింగంపేట గ్రామాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి వ్యవసాయ శాఖ ఏడిఏ వీరస్వామి మాట్లాడారు. సొసైటీల చైర్మన్లు దేవేందర్‌రెడ్డి, రమేశ్, సుకన్య, సహకార సంఘం సహాయక రిజిస్ట్రార్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ మాకం రాములు, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధిరాములు, శ్రీనివాస్, ఎంపీటీసీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : ఇరవై ఎకరాల్లోపు పంటల సాగు చేస్తున్న రైతులందరికీ రైతుబంధు పథకాన్ని వర్తింప జేయాలని గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు బంధు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. రైతు నాయకులు గొట్టం నర్సింలు, రవీందర్‌రెడ్డి, ఆకాష్, లోక్యానాయక్ తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్) : మండలంలోని రాంపూర్ గ్రామంలోని సహకార సంఘం గోదాంలో మంగళవారం రైతుబంధు పథకం అమలుపై సహకార సంఘం సభ్యుల అభిప్రాయ సేకరణ, సూచనలపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు రైతుభీమా 80ఏళ్ల వరకు అమలు చేయాలని, పదెకరాల వరకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శప్దం రెడ్డి, ఏఈవో కిషన్, సీఈవొ సంతోష్‌రెడ్డి తదితరులున్నారు.

‘అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం’

కామారెడ్డి టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను అహ్వానిస్తున్నట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపిక మార్గదర్శకాల కోసం ఎంహెచ్ఆర్‌డీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

పాలిథిన్ కవర్లు వినియోగించవద్దు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : దుకాణాదారులు పాలీథిన్ కవర్లు వినియోగించవద్దని మున్సిపల్ సిబ్బంది వ్యాపారులకు సూచించారు. పాలిథీన్ కవర్ల వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, విక్రయించిన వారికి జరిమానా వేస్తామన్నారు. పాలిథీన్ కవర్లకు బదులుగా జూట్ బ్యాగులను లేదా చేతి సంచులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

బాగా చదివి ప్రయోజకులు కావాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని సీఐ రవీందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని వెల్లుట్లపేట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు తన సొంత ఖర్చులతో నోటుబుక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేష్, గ్రామ పెద్దలు సాయిలు, గణపతి, రాజాగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వైద్యులకు సన్మానం



కామారెడ్డి అర్బన్ : జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పది మంది ప్రముఖ డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాశాఖాధికారి చంద్రశేఖర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు ఎన్‌వీ రమణ, ప్రోగ్రాం చైర్మన్ వెంకటరాజం, రోటరీ అధ్యక్షుడు పి.రాజనర్సింహరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి ఉన్నారు.

అధైర్యపడొద్దు.. మళ్లీ అధికారం మనదే..



భిక్కనూరు : పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కార్యకర్తలు నేతలు ఎలాంటి అధైర్యపడవద్దని మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు స్థానికంగా జరిగిన ప్రత్యేక మండల సమావేశాన్ని బహిష్కరించారు. అనంతరం వారు ప్రత్యేక వాహనంలో ఎర్రవెల్లిలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి స్థానిక రాజకీయ పరిస్థితులు ఆయనకు వివరించారు. రాజ్యాంగబద్ధంగా ఎలాంటి అధికారం లేనప్పటికీ షబ్బీర్ అలీ సమావేశానికి రావడంతో తాము సమావేశాన్ని బహిష్కరించినట్లు స్థానిక నాయకులు కేసీఆర్‌కు వివరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. కేసీఆర్ ను కలిసిన వారిలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సాయిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సువర్ణ ప్రభాకర్ మంజుల రాములు లీలావతి బాలా గౌడ్‌సాయ గౌడ్ మండల టీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సిద్ధిరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యురాలు సుల్తానా నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

కాలభైరవుడికి సిందూర పూజలు



రామారెడ్డి : మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీకాళభైరవుడికి మంగళవారం భక్తులు సింధూర పూజలు జలాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభమైన భజన కార్యక్రమం రెండు గంటల వరకు కొనసాగింది. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు గుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ వంశీకృష్ణ శర్మ, సురేందర్, నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పండుగ



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్‌లో గ్రామ దేవతల పండుగలు మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. మంగళవారం గ్రామ శివారులోని గండెమ్మ, లక్ష్మమ్మ దేవతలకు గ్రామస్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమేశ్ యాదవ్, మాలీస్ వెంకటేశం, పోలీస్ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



పిట్లం(జుక్కల్) : వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని అల్లాపూర్ గ్రామస్తులు మంగళవారం పాదయాత్రగా వెళ్లి 11 హనుమాన్ ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో పాల్గొన్న వారి కోసం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గైని పోచయ్య పండ్లను అందజేశారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్‌లో రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం నుంచి ఎండ్రియాల్, తాడ్వాయి, దేమికలాన్, బరుగిద్దె, ముస్తాపూర్, నందివాడ తదతర గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కల్కి ఆలయంలో అన్నదానం

కామారెడ్డి అర్బన్ : స్థానిక శ్రీకల్కి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్కి భక్తులు కే.పావని, దిగంబర్, కే.వాణి, వేణుగోపాల్, చంద్రశేఖర్, బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(భాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్తం

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద హైస్కూల్‌లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మంగళవారం ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన తాగునీటి వసతి, ఎలక్ట్రిసిటీ, పాఠశాల భవనం పైకప్పు మరమ్మత్తులతోపాటు టాయిలెట్స్ మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఆయన వెంట నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న, జీపీ కార్యదర్శి నర్సింలు తదితరులున్నారు.

నేడు రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రైతులు అందరు హాజరుకావాలని బిచ్కుంద సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలాజి అన్నారు. బుధవారం సొసైటీ ఆవరణలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు.

సహకార సంఘ సమావేశం..

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో బుధవారం సహకార సంఘ సభ్యులతో సొసైటీ చైర్మన్ శీనుపటేల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు కార్యదర్శి బాబురావ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ అధ్యక్షతన జరిగే సమావేశంలో రైతు భరోసా పథకం అమలుపై రైతులు, సహకార సంఘాల సభ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటారన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



రామారెడ్డి : పద్మశాలి విద్యార్థులు చదువులో రాణించాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు దుదుక నరేందర్ అన్నారు. మంగళవారం రామారెడ్డి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది పద్మశాలి విద్యార్థులకు నోట్ పుస్తకాలను,పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు దుదుక నరేందర్,ప్రధాన కార్యదర్శి సుప్పని రవి, ఉపాధ్యక్షులు మాదాసు శ్రీనివాస్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతరెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌గేట్ వద్ద మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో వాసుదేవ్‌తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.